క్లుప్తంగా

నిబంధనలు పాటించండి



బలభద్రపురంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

బిక్కవోలు: వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్సై వాసంశెట్టి రవి చంద్రకుమార్ అన్నారు. శనివారం ఆయన బలభద్రపురంలోని వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్, నంబర్ ప్లేట్స్ లేని వాహనాలను పరిశీలించి 10 మందిపై కేసులు నమోదు చేశారు. ఎస్సై మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు క్రమం తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. రికార్డు సక్రమంగా ఉండాలని, నంబర్ ప్లేట్స్ సరిగా లేని వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలోని స్వచ్ఛంద్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమం తప్పకుండా భోజనం చేసే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే ఇంటి వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

బిక్కవోలు: గణపతి నవరాత్రులను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని తహసీల్దార్ కృష్ణ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సింగిల్ విండో ఏర్పాటు నిమిత్తం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో, ఎస్సై మాట్లాడుతూ, ఉత్సవ పందిళ్లకు ముందుస్తుగా పోలీస్, ఫైర్, విద్యుత్, రెవెన్యూ శాఖల నుంచి ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పందిళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే పూజలు, భజనలు నిర్వహించాలన్నారు. రాజకీయ పార్టీల జెండాలు, హీరోల ఫొటోలు, రాజకీయ నాయకులు ఫొటోలు ఏర్పాటు చేయవద్దన్నారు. నిమజ్జన సమయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేంద్ర ప్రసాద్, ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



జీఎల్ఎల్ దేవి

రాజానగరం: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే వినాయకుడి విగ్రహాలు, నిమజ్జనం తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుగా అనుమతులు తీసుకోవాలని స్థానిక తహసీల్దారు జీఎల్ఎల్ దేవి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ, స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ సింగిల్ విండో విధానాన్ని ఏర్పాటు చేశారన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

స్టీలు కంచాల వితరణ

అనపర్తి: మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల సౌకర్యార్థం స్టీలు కంచాలను పాఠశాలకు వితరణ చేశారు. పులగుర్త ఆర్‌బీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ ఆయన మాతృమూర్తి 5వ వర్ధంతి సందర్భంగా శనివారం రూ.5వేల విలువైన 50 కంచాలను ప్రధానోపాధ్యాయుడు సీతామహాలక్ష్మికి అందజేశారు. అలాగే పాఠశాలలో పనిచేసే వారికి నూతన వస్త్రాలు, ఎఫ్ఏ-1 పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, బ్యాడ్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట బీమా చేయించుకోవాలి

రంగంపేట: రైతులందరూ క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని శనివారం మండల వ్యవసాయ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఈనెల 30 వరకు క్రాప్ ఇన్సూరెన్స్ గడువు పొడిగించామని, రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి ఎకరానికి రూ.575, మినుము రూ.300లు ప్రీమియం చెల్లించాలన్నారు. పథకాలు అమలు కావాలంటే పంట నమోదు కార్యక్రమాన్ని రైతులు తప్పనిసరిగా చేయించుకుంటే ప్రతి రైతు అర్హత కలిగి ఉంటారన్నారు.

జీజీయూలో క్రీడా పోటీలు

రాజానగరం: గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించే దిశగా ×ఇషా౯ గ్రామోత్సవం పేరిట క్రీడా పోటీలు నిర్వహించడం హర్షనీయమని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రొ.వీసీ రాజు అన్నారు. 17వ ఇషా గ్రామోత్సవంలో భాగంగా జీజీయూ క్రీడా మైదానంలో రూరల్ ప్రీమియం లీగ్- 2025 జిల్లా క్లస్టర్ మ్యాచ్‌లు శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో పురుషులు వాలీబాల్, మహిళలు త్రోబాల్ ఆడతారు. వీటిలో గెలిచిన వారు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

ప్లీజ్.. చోటివ్వండి

- మహిళలతో కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు
- పాస్‌లున్నా ఎక్కలేకపోతున్న విద్యార్థులు
- సీటు కోసం సిగపట్లు పడుతున్న వైనం



బస్సు ఎక్కేందుకు కుస్తీ పడుతున్న మహిళలు

రాజానగరం: రాష్ట్ర ప్రభుత్వం 'స్త్రీశక్తి' పేరుతో అమలు చేస్తున్న ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు మాత్రం లేనిపోని కష్టాలు ఎదురవుతున్నాయి. నిన్నటి వరకు ప్రయాణికులతో ఆటోల్లో రద్దీ ఎక్కువగా ఉండేది. స్త్రీ శక్తి పథకం అమలులోకి వచ్చిన ఆగస్టు 15 నుంచి ఆటోల్లో రద్దీ తగ్గి, ఆర్టీసీ బస్సుల్లో ఆ వాతావరణం కనిపిస్తుంది. బస్సుల్లో ప్రయాణించే వారిలో 80 శాతం పైబడి మహిళలే ఉంటున్నారు.

ప్రయాణికుల రద్దీ అధికం

పథకం అమలుకు ముందు బస్సుల కోసం ఎదురు చూడకుండా వీలైనంత వరకు ఆటోల్లోనే మహిళలు ప్రయాణాలను కొనసాగించేవారు. స్త్రీశక్తి పథకం వచ్చిన తరువాత చాలా వరకు సీన్ రివర్స్ అయింది. ఆటో వాళ్లు వారి ముంగిటకు వచ్చి ఎక్కడికి వెళ్లాలని అడుగుతున్నా బస్సు వస్తుందిలే అంటూ మహిళలు గంటల తరబడి వాటి కోసమే వేచి చూస్తున్నారు. దీంతో పట్టణాలు, నగరాల్లోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని బస్టాప్‌లలో కూడా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆర్టీసీ బస్సు వచ్చిందంటే చాలు ఎక్కేందుకు పోటీ పడుతున్నారు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి కుళాయిల వద్ద మహిళలు ఘర్షణ పడటం అక్కడక్కడా చూస్తుంటాం. కానీ, నేడు ఆ వాతావరణం బస్టాండ్‌లో దర్శనమిస్తుంది. బస్సు ఎక్కి, సీటు దక్కించుకునేందుకు మహిళలు సిగపట్లు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పురుషుల పరిస్థితి ప్రేక్షక పాత్రగానే మిగిలిపోతుంది. అవకాశం ఉంటే కలిసి ప్రయాణిస్తున్నారు, లేకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

విద్యార్థులున్న చోట ఆగట్లేదు

స్త్రీశక్తి ప్రభావంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ఆధార్ కార్డును చూపిస్తే చాలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ పథకం వర్తిస్తుంది. ఘాట్ రోడ్లల్లో ప్రయాణాలకు కూడా అనుమతించడంతో ఆర్టీసీ బస్సులు ఖాళీగా తిరిగే పరిస్థితులు లేకుండా పోయాయి. బస్సు సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కుతున్న నేపథ్యంలో విద్యార్థులకు బస్సుల్లో అవకాశం దొరకడం లేదు. ఉన్నత చదువుల కోసం కళాశాలలకు వెళ్లి వచ్చేందుకు ఉదయం 8 నుంచి 9, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యార్థులు బస్సుల కోసం చూస్తుంటారు. ఇందుకు గాను నెలరోజులు ముందుగానే ఆర్టీసీ నుంచి నిర్ణీత చార్జీలు చెల్లించి, బస్ పాస్‌లు తీసుకుంటారు. అయితే స్త్రీశక్తి పథకం పుణ్యమా అని విద్యార్థులకు బస్ పాస్‌లు ఉన్నా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. బస్సుల్లో మహిళా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో విద్యార్థులను ఎక్కించుకునేందుకు జాగా లేక వారు ఉన్నచోట బస్సులను ఆపట్లేదనే విమర్శలు వస్తున్నాయి. తమ కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో స్టూడెంట్ స్పెషల్ బస్సులు వేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

మరిన్ని బస్సులు పెంచాలి

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం బాగుంది. సామాన్యులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ పథకం కారణంగా ఎక్కువ మంది మహిళలు బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. దీంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా బస్సుల సంఖ్యను పెంచితే మరింత బాగుంటుంది.

– తీగిరెడ్డి అనసూయ, పాతతుంగపాడు.

స్టూడెంట్స్ స్పెషల్ వేయాలి

స్త్రీశక్తి పథకం కారణంగా కళాశాలలకు బస్సుల్లో వెళ్లి రావడమంటే చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. అన్ని బస్సులు మహిళతో కిక్కిరిపోతున్న నేపథ్యంలో మాకు బస్సు ఎక్కేందుకు కూడా అవకాశం ఉండటం లేదు. విద్యార్థులున్న చోట బస్సులను ఆపడం లేదు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ఈ సమస్య మరింత అధికంగా ఉంటుంది. ఈ కారణంగా విద్యార్థుల కోసం స్టూడెంట్ స్పెషల్ బస్సులు వేయాలి.

– పంపన శ్రీనివాస్‌నాయుడు, రాఘవపురం.

కన్నబాబుకు కృష్ణారెడ్డి పరామర్శ



సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనపర్తి: పితృవియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ సీపీ పరిశీలకుడు కురసాల కన్నబాబును అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి నల్లమిల్లి విజయ్‌రెడ్డి, నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు పరామర్శించారు. కురసాల సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ, సత్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటని, కాకినాడ రూరల్ నియోజకవర్గంలో తనదైన శైలిలో పార్టీని నడిపించిన వ్యక్తి అని సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, మండల సేవాదళ్ అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాస్, ఎస్సీ సెల్ నాయకులు డోకుబుర్ర కృష్ణ, నల్లమిల్లి శ్రీనివాస రెడ్డి, తాడాల మణికంఠ స్వామి తదితరులు ఉన్నారు.

చదువుల గాయత్రి.. అందరికీ స్ఫూర్తి



తోలేటి గాయత్రి



శ్రీనివాస్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలోని లంకూరుకు చెందిన తోలేటి గాయత్రి మెగా డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ)కి సంబంధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. ఆమె తన జీవన పోరాటంలో అనేక కష్టాలను అధిగమించింది. రైతు కుటుంబానికి చెందిన గాయత్రి 2003లో 10వ తరగతి పూర్తి చేసిన తర్వాత కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేక చదువును ఆపేసింది. అనంతరం వివాహం జరగ్గా, 2012లో భర్తను కోల్పోయింది. ఆమెలోని ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మళ్లీ చదువును ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఓపెన్ ఇంటర్ పూర్తి చేసి, డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ చదివింది. ఎక్కడా కోచింగ్ తీసుకోకుండానే డీఎస్సీలో 93.5 మార్కులు సాధించింది.

ఉపాధ్యాయ సేవపై మక్కువతో

అనపర్తి: ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని పీరారామచంద్రాపురం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్ జిల్లా 11వ ర్యాంకును సాధించారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ విభాగంలో అర్హత సాధించిన శ్రీనివాస్ ఉపాధ్యాయ సేవపై మక్కువతో కష్టపడి చదివినట్లు తెలిపారు. కష్టానికి ఫలితం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. సచివాలయ సహచర సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహంగా అంతర్గత క్రీడా పోటీలు

బిక్కవోలు: మండలంలోని పందలపాక ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పాఠశాల అంతర్గత క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయని పాఠశాల పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి అన్నారు. శనివారం క్రీడా దినోత్సవం పురస్కరించుకుని జరుగుతున్న పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. సోమవారం ఫైనల్స్ జరుగుతాయని పీడీ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో కొలువైన ప్రసన్న వేంకటేశ్వరస్వామిని శ్రావణమాసం ఆఖరి శనివారం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. వేకువజాము నుంచే స్వామి అభిషేకాలు, సుప్రభాతం సేవ, తోమాల అర్చన వంటి సేవలు నిర్వహించారు. ఆలయం కమిటీ సభ్యులు భక్తులకు అన్నసమారధన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొంకుదురు, పందలపాక, బిక్కవోలు, కొమరిపాలెం తదితరుల గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపరచాలి

రంగంపేట: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామాల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి సాయిబాబు సూచించారు. శనివారం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులు, గ్రామస్తులు సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చేతుల పరిశుభ్రతపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనసూయ, మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు, మధుసూదనరావు, వేణుశ్రీలక్ష్మి, సచివాలయ కార్యనిర్వాహణాధికారి శ్రీరామమూర్తి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పార్థసారథి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఓ తులసీదాస్, ఏఎన్ఎం హైమావతి, ఉపాధి హామీ పథకం ఏపీఓ నాగేశ్వేణి పాల్గొన్నారు.

మట్టి ప్రతిమల పంపిణీ



వినాయకుని ప్రతిమలను మట్టితో తయారు చేస్తున్న విద్యార్థులు

రంగంపేట: మండలంలోని సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా వినాయక మట్టి ప్రతిమలు తయారు చేసి తోటి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పంపిణీ చేస్తున్నారు. వర్క్ ఎడ్యుకేషన్ పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ ప్రసన్న ప్రోత్సహంతో ప్రతిమలు ప్రతి ఏటా అందిస్తున్నారు. నిమజ్జనం చేసే సమయంలో రంగులు, రసాయనిక ఇతర పదార్థాలతో తయారు చేసే ప్రతిమల వల్ల జల పుష్పాలు, జలజీవాలు అనారోగ్యానికి గురి అవుతాయనే ధ్యేయంతో ఈ ప్రతిమలు చేస్తున్నారని టీచర్ ప్రసన్న తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు భాస్కరరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజానగరం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితికి ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన గణనాథులనే పూజించాలని దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థులు అన్నారు. ఉపాధ్యాయుల సూచనల మేరకు వినాయకుని ప్రతిమలను తయారు చేశారు. సుమారు వెయ్యి విగ్రహాలు తయారు చేసి రాజానగరం, దివాన్‌చెరువు, రాజమహేంద్రవరం పరిసరాల్లోని ప్రముఖులకు ఉచితంగా అందజేయనున్నారు. పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఏటా ఈ విధంగా మట్టితో చేసిన వినాయకుని ప్రతిమలను పంపిణీ చేయడాన్ని విద్యార్థులు ఆనవాయితీగా చేసుకున్నారని మేనేజర్ మూర్తి, ప్రిన్సిపాల్ విమల తెలిపారు.

దాతలను ఎమ్మెల్యే అవమానిస్తున్నారు



విలేకరులతో మాట్లాడుతున్న సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రామవరంలోని ప్రభుత్వ ఆసుపత్రి పేరుపై అనవసరమైన రాజకీయం చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి స్థల దానానికి, విరాళానికి వ్యత్యాసం తెలియదా? అంటూ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం ఆయన అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, నూతనంగా నిర్మించిన అనపర్తి ఏరియా ఆసుపత్రికి స్థల దాతల పేరు ఎలా పెట్టారంటూ ఎమ్మెల్యే అవగాహన లేకుండా ప్రశ్నిస్తున్నారన్నారు. దాత ఇచ్చిన భూమిపై ఎన్ని మార్పులు చేసినా ఆ ఫలితం వారికే దక్కుతుందన్న జ్ఞానం లేకుండా మాట్లాడటం ఎమ్మెల్యేకి తగదన్నారు. టీడీపీ అధికారంలో ఆసుపత్రి ఆవరణలో దాతల విగ్రహాలను వ్యతిరేకించగా.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వారి విగ్రహాలను పెట్టించడానికి కృషి చేసిన సంగతి నియోజకవర్గంలో అందరికి తెలుసన్నారు. నియోజకవర్గంలో 40 ఏళ్లుగా దాతలు, పెద్దలు తమ సొంత స్థలాలు ఇచ్చి ప్రజల కోసం నిర్మాణాలు చేశారు. ఎమ్మెల్యే చవకబారు రాజకీయాలు చేసి ఆ మహనీయులను అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పొగాకు వ్యతిరేక నినాదాలతో ర్యాలీ

సీతానగరం: టొబాకో ఉత్పత్తులన్నీ క్యాన్సర్‌కు మూలమని రఘుదేవపురం పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. శనివారం రఘుదేవపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంతాన్ని నో టుబాకో జోన్ ప్రకటిస్తూ ప్రజలకు టొబాకో వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. హెచ్ఎం శ్యామలాదేవి మాట్లాడుతూ, సిగరెట్లు, చుట్టలు, బీడీలు, గుట్కా మొదలైనవి పొగాకు ఉత్పత్తులేనని, ఇందులో ఉండే నికోటిన్ వదల్లేని అలవాటుగా మారి వ్యసనపరులను చేస్తుందన్నారు. దీనితో గుండె సంబంధిత జబ్బులు, వివిధ క్యాన్సర్లకు ఇదే కారణమన్నారు. ప్రజలను చైతన్య పరచడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమన్నారు. పొగాకు వ్యతిరేక నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీరోడన్లు తనిఖీ చేసిన అధికారులు



చంద్రేడులో సీసీరోడ్డును తనిఖీ చేస్తున్న అధికారులు

రంగంపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో 2024-25లో నిర్మించిన సీసీరోడ్లను శనివారం రాజమహేంద్రవరం క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశారు. చంద్రేడులో రూ.25 లక్షలతో నిర్మించిన మూడు సీసీ రోడ్లు, పెదరాయవరంలో రూ.11 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, మర్రిపూడిలో రూ.26 లక్షలతో నిర్మించిన మూడు సీసీ రోడ్లు, సింగంపల్లిలో రూ.21 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లు, నల్లమిల్లిలో రూ.11 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును వారు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో రాజమహేంద్రవరం డీఈఈ అహ్మద్, క్వాలిటీ కంట్రోల్ జేఈ దీప్తి, బిక్కవోలు డీఈఈ అచ్యుతరామరెడ్డి, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



యోగి ప్రేమ్‌కుమార్ (ఫైల్)

కోరుకొండ: మండలంలోని పశ్చిమగాను గూడెం హైవే సింహపు రిలేఅవుట్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డికి చెందిన యోగి ప్రేమ్‌కుమార్ (44) మృతి చెందాడు. కోరుకొండ ఎస్సై నాగార్జున తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుమ్మళ్లదొడ్డిలో పీఎంపీగా వైద్య సేవలందిస్తున్న ప్రేమ్‌కుమార్ మందుల నిమిత్తం కోరుకొండ వచ్చి, వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు ప్రేమ్‌కుమార్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొడుకు సింగిల్ కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. ప్రేమ్‌కుమార్ మృతితో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

ధ్యానంతో మానవాళి వికాసం

కోరుకొండ: ధ్యానంతోనే మానవాళి వికాసం సాధ్యమవుతుందని 111 ఏళ్ల హిమా లయయోగి సదానందగిరి స్వామీజీ అన్నారు. శనివారం కోరుకొండలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆత్మజ్ఞాన ప్రవచనంలో ఆయన వెల్లడించారు. ధ్యానం ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని, మానవుని జీవ తకాలాన్ని పెంచుతుందన్నారు. మానసిక వికాసానికి నాంది పలుకుతుంన్నారు. సనాతన ధర్మం, హైందవ పద్ధతులను విస్తృతం చేస్తుందని, పరమత దూషణను ప్రోత్సహించదన్నారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

హిందూ భావన కలిగి ఉండాలి

సీతానగరం: ప్రతి హిందువుకు తాను హిందువును అనే భావన కలిగి ఉండాలని విశ్వహిందు పరిషత్ ఉత్తరాంధ్ర, దక్షిణాంధ్ర ప్రాంత కార్యదర్శి శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం సీతానగరం విష్ణువుని ఆలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, హిందువులు ఆలయాలకు వెళ్లి భక్తిభావనతో దేవుడిని ఆరాధిస్తారన్నారు. కానీ, నేను హిందువుననే భావన వారిలో లేకపోవడంతో సమాజానికి హాని కలుగుతుందన్నారు. హిందువుననే భావన ప్రతి ఒక్కరిలో పెంపొందించుకోవాలంటే ప్రతి గ్రామంలోనూ సత్సంగాలు నిర్వహించి, హిందువులందరూ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అర్చక పురోహిత మఠ మందిర్ ప్రముఖ్ నరసింహశర్మ, సీతానగరం విశ్వహిందు పరిషత్ సంఘ మండల కార్యదర్శి దోనేపల్లి సీతారాముడు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి



అనపర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో తదితరులు

అనపర్తి: అందరూ స్వచ్ఛాంధ్ర దిశగా పయనిద్దామని సర్పంచ్ వారా కుమారి అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అనపర్తి సచివాలయం-4 అంగన్‌వాడీ వద్ద ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా అనపర్తి పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి నెల మూడో శనివారం ప్రజలను జాగృతం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ

పెదపూడి: ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. పెదపూడిలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. మానవహారం పఠించి ప్రతిజ్ఞ చేశామన్నారు. నరేంద్రరెడ్డి మాట్లాడుతూ, ।నీడనిచ్చే చెట్లను పెంచండి.. వేడి తాపాన్ని హరించండి౯ అంటూ నినాదాలు చేశామన్నారు. దీనిపై ప్రజల్లో చైతన్యం పెంచాలన్నారు. అలాగే క్లీన్ విలేజ్ అండ్ గ్రీన్ విలేజ్ అనే నినాదాలతో ప్రజలను ఉత్తేజ పరచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీనువాసు, సచివాలయ కార్యదర్శి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో ప్రజల భాగస్వామ్యం కీలకం

కలెక్టర్ ప్రశాంతి



కంబాలచెరువులో గంబూషియా చేపలు వదులుతున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర విజయవంతం కావడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా శనివారం కంబాల చెరువు పార్కులో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఉద్యోగులు, స్థానికులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డ్రోన్ సాయంతో కంబాల చెరువులో దోమల మందును పిచికారీ చేశారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్సీ చేతుల మీదుగా చెరువులో దోమల నివారణకు గంబూషియా చేపలను విడిచిపెట్టారు. దోమలు వృద్ధి కేంద్రాలను ఎప్పటికప్పుడు గుర్తించి, లార్వా దశలోనే నియంత్రించడంపై దృష్టి సారించాలని పబ్లిక్ హెల్త్ సిబ్బందికి కలెక్టర్ సూచించారు. కాలువలు, కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు రసాయనాలు పిచికారీ చేయాలన్నారు. ప్రజలు తమ ఇళ్లలో పాడైన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఉంచుకోవడం ద్వారా లేదా విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం వల్ల వాయుకాలుష్యం పెరుగుతోందన్నారు. క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశముందని, ఈ వ్యర్థాలను సేకరణ కేంద్రంలో అందజేస్తే వాటిని సరైన రీతిలో రీసైక్లింగ్ చేసి ముప్పు లేకుండా తొలగించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పులను అధిగమించేందుకు ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఈ (ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సీతానగరం: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ ఆధ్వర్యంలో నాగరత్నం కాలనీలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం మాన్సూన్ హైజీన్ అనే శీర్షికతో నాగరత్నం కాలనీ వరకు విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించి, వర్ష ఋతు సంబంధమైన వ్యాధులు, ముందు జాగ్రత్తలు, ఆరోగ్య పరిరక్షణ అనే అంశంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, తుప్పలు, పొదలను తొలగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పీవో సుధామయి తదితరులు పాల్గొన్నారు.